క్లుప్తంగా

సర్వే అడ్డగింత

దుమ్ముగూడెం: మండలంలోని ఎల్ఎస్ రావు పేట గ్రామస్తులు సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ సేకరణ కోసం 3వ సర్వే చేస్తున్న అధికారులను మంగళవారం అడ్డుకున్నారు. ఎల్ఎస్‌రావు పేట రెవెన్యూలో రైతాంగానికి కనీసం సమాచారం తెలుపకుండా హద్దులు జెండాలు పాతి, సర్వే చేస్తున్నారని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం, చర్ల మండలాల సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కొమరం దామోదర రావు సర్వే అధికారులతో మాట్లాడగా.. ప్రాజెక్టు ఏఈ రాజేశ్వరి ఆదేశం ప్రకారం సర్వే చేస్తున్నామని జీవీఆర్ కంపెనీ సూపర్వైజర్ సింహాచలం బదులిచ్చారు. రైతాంగానికి కలిసి ప్రాజెక్టు డీపీఆర్ చూపించి, పూర్తి వివరాలు రైతుల ఎదుట చెప్పాలని దామోదరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుష్టికామరాజు, పాడియం జానకిరావు, తెల్లం శ్రీనివాసు, పూనెం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సర ఆగమనం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు కవులు, కవయిత్రులు, గాయకులు పాల్గొని కవితాగానలు చేసి అలరించారు. అనంతరం కవులను శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తాళ్లూరి పంచాక్షరయ్య, పాకాల దుర్గాప్రసాద్, మొల్ల చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ, మాల్యశ్రీ, వి.వరలక్ష్మి, జకరయ్య, కేశబోయిన ప్రసాద్, పద్మావతి, యువశ్రీ, కనకదుర్గ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో తనిఖీ

అశ్వాపురం: అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎంఏ రాజు మంగళవారం సందర్శించారు. కళాశాలలో గదులు పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షకు విద్యార్థుల హాజరును తహసీల్దార్ పరిశీలించగా 95 మందికి 92 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై తహసీల్దార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సత్యప్రకాష్, ఆర్ఐ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నూకాలమ్మగా అలంకరణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం అమ్మవారు భక్తులకు నూకాలమ్మ అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, చండీ పారాయణ అర్చనలు, నివేదన, నీరాజన మంత్రపుష్పం, కుంకుమ పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి సమయంలో ఆలయం సంగీత నృత్య ప్రదర్శన, డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోటార్‌సైకిల్ ర్యాలీ

మణుగూరుటౌన్: మణుగూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న జన చైతన్య యాత్ర కోసం మంగళవారం మణుగూరు సీపీఎం ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈనెల 19 నుంచి 21 వరకు భద్రాద్రి జిల్లాలో జన చైతన్య యాత్ర కొనసాగుతున్న సందర్భంగా మద్దతుగా మణుగూరు బైక్ ర్యాలీ నిర్వహించి సారపాక వరకు కొనసాగించారు. సారపాకలో యాత్రకు ఘనస్వాగతం పలికారు. సీపీఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు లెనిన్ బాబు, ప్రసాద్, నర్సింహారావు, లక్ష్మణ్‌రావు, సత్రపల్లి సాంబశివరావు, సీఐటీయూ,సీపీఎం నేతలు పాల్గొన్నారు.

బాధితులకు వితరణ

బూర్గంపాడు: నాలుగు నెలల క్రితం సారపాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గాంధీనగర్‌కు చెందిన బొల్‌సింగ్ కుటుంబానికి బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బాసటగా నిలిచింది. చంటి పిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మృతుడి భార్యకు మండల పరిషత్ సిబ్బంది మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నగదు, దుస్తులు, బియ్యం, నిత్యావసరాలను అందించారు. వీరితో పాటుగా భద్రాచలంలోని విక్రమ్ సూపర్ మార్కెట్ నిర్వహకుడు కూడా తమవంతుగా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీల్, మండల పరిషత్ కార్యాలయ అధికారులు దుగ్గిరాల విజయలక్ష్మి, గొడపర్తి రఘు, కంప్యూటర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అతిక్రమిస్తే చర్యలు

మణుగూరురూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని మణుగూరు ఎస్సై పురుషోత్తం అన్నారు. మండలంలోని హనుమాన్ టెంపుల్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై పురుషోత్తం తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మణుగూరు -కొత్తగూడెం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను నిలిపి సంబంధిత ధృవపత్రాలను పరిశీలించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వాహనదారులకు, ధృవపత్రాలు లేని వారికి ఈ జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- పిల్లలు, గర్భిణులు, తల్లులకు ఉపయోగకరం
- అవగాహన కల్పించిన ఐసీడీఎస్ సిబ్బంది
- వీధుల్లో పోషణ్ పక్వాడా ర్యాలీ



అన్నపురెడ్డిపల్లి: పోషణ్ పక్వాడా ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



దుమ్ముగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా ర్యాలీ..

అన్నపురెడ్డిపల్లి: చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని చంద్రుగొండ ప్రాజెక్ట్ సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.చిరుధాన్యాలు , వాటి ఆవశ్యకత గురించి పిల్లల తల్లులకు వివరించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో వైవిధ్యం పాటించాలని, పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం పోషణ పక్వాడా ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ, సూపర్‌వైజర్లు గంగాజలం, అరుణ కుమారి, పంచాయతీ సెక్రటరీ ఖాదర్, అంగన్‌వాడీ టీచర్లు శివ, కుమారి, లావణ్య, విజయ, భారతి, రమదేవి, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలోని మారాయిగూడెం సెక్టార్‌లో ఉన్న సింగారం జీపి వైట్ నగరం గ్రామంలో పోషణ్ పక్షం సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సింగారం సర్పంచ్ సోడి కొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం అందరూ తప్పనిసరిగా తీసుకోవాలని పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం పోషణ్ ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మారాయిగూడెం ఐసీడీఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, నిర్మల, అచ్చమ్మ, వివో లీడర్ కృష్ణవేణి, వార్డ్ మెంబర్ జోగమ్మ, తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు సీడీపీఓ నిర్మలాజ్యోతి తెలిపారు. చిన్నపిల్లల పోషణ, తల్లులు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.శకుంతల, కె.రాణి, టీచర్లు అరుణ, భూషమ్మ, సుజాత, మీనాక్షి, సరోజిని, విజయ పాల్గొన్నారు.

ఆయుష్ కిట్లు అందజేత

అశ్వారావుపేట: పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఉచితంగా ఆయుష్ కిట్‌లను అందించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు ఆయుర్వేద పుస్తకం, బ్రహ్మీ గుళికలు, రాగి లడ్డూలతో కూడిన ఆయుష్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల ఆర్యోగాన్ని మెరుగు పరిచేందుకు ఈ కిట్‌లను అందించడం హర్షనీయన్నారు. జ్ఞాపక శక్తి, రోగ నిరోధక శక్తి పెంపొందేందుకు కిట్లు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఆయుర్వేద వైద్యులు సీహెచ్ శోభారాణి, ఫార్మాసిస్ట్ రామకృష్ణ, సిబ్బంది డిగ్గీ బాబు పాల్గొన్నారు.



అశ్వారావుపేట: విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి

బూర్గంపాడు: సరైనా పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులం కాగలుగుతామని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడులోని జెడ్పీఎస్ఎస్ (బాలికలు), కస్తూర్బా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుంచి అందిస్తున్న న్యూట్రిషియన్ల కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉత్సాహంగా ఉండేందుకు ఈ న్యూట్రిషియన్ కిట్లు ఉపయోగపడతాయన్నారు. రెండు పాఠశాలల్లోని 478మంది విద్యార్థినులకు పోషక విలువలతో కూడిన రాగిలడ్డులను కూడా అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, హెచ్ఎంలు దూద, పరమేశ్వరి, వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, రత్నావళి, విజయకుమార్ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గాంధీబొమ్మసెంటర్‌లో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహరావు చేతుల మీదుగా న్యూట్రిషన్‌కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కిట్ల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, అశ్వాపురం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గుమ్మడి అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, బీఆర్ఎస్ నాయకులు అడపా అప్పారావు, మడి వీరన్నబాబు, మేకల రవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

బూర్గంపాడు: అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ప్రతినిధులతో కలసి తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి, మండల వ్యవసాయ అధికారి శంకర్‌లకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో మామిడి, బొప్పాయి, మొక్కజొన్న, మిర్చి పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కుల రాంబాబు, వైఎస్‌రెడ్డి, కొండపనేని సత్యనారాయణ, బర్ల రామకృష్ణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో వరి పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఏ.రాజుకు టీజేఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి పిప్పళ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గుండాల: ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతుకూలిసంఘం(న్యూడెమోక్రసి అనుబంధం) జిల్లా నాయకులు ముక్తి సత్యం, సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వందల ఎకరాల్లో చేతికందిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో పెండెకట్ల పెంటయ్య, యాసారపు వెంకన్న, అజ్గర్, గడ్డం లాలయ్య, పూణె బాబు, అరెం నరేష్, నాగేష్, ఈసం క్రిష్ణ, మంగయ్య, రాంబాబు, వెంకన్న, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అటవీ అధికారితో మాట్లాడుతున్న ఎంపీపీ ముక్తి సత్యం

గుండాల: మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పీటీసీ వాగబోయిన రామక్క అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలల మరమ్మతులు, జీపీఎస్ పాఠశాలల పనులు పూర్తి చేయాలని సూచించారు. రహదారులు, భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని తెలిపారు. మండలంలో చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని, లీకేజీలు జరుగుతున్నాయని ప్రజాప్రతినిధులు వాపోయారు.

వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే మరమ్మతులు చేపడుతామని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. వచ్చే వానాకాలం సీజన్ నాటికి చెరువులు, కుంటలు, మళ్లింపు కాలువ పనులు పెండింగ్‌లో లేకుండా పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టాలపై వెంటనే సర్వే చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఏఈ సురేష్‌ను కోరారు. పోడు భూముల అంశంపై డీఆర్‌ఓతో చర్చించారు. మండలంలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో పోస్టుమార్టం కేంద్రం కోసం స్థలం ఏర్పాటుకు తీర్మానం చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు సీతారాములు, ముత్యమాచారి, జయసుధ, ఎంపీటీసీ కష్టారావు, క్రిష్ణవేణి, పద్మ, ఎంపీడీవో సత్యనారాయణ, డీటీ కృజిని, డీఆర్‌ఓ బాలాజీ, పీఆర్ఏఈ అఖిల్, ఐటీడీఏ ఏఈ శ్రీకాంత్ , ఏపీఎం వినోద్, ఏపీఓ రవితేజ, ట్రాన్స్‌కో ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ కిషోర్, వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్, ఏఈఓ శ్రీకన్య తదితరులు పాల్గొన్నారు.

27న వేలంపాట

చర్ల: చర్ల గ్రామపంచాయతీలో ఈ నెల 27 జంతువధశాల, షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ఆశీలు వసూళ్లు, పశువుల సంతలకు సంబందించి బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయితీ సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, కార్యదర్శి కె కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు హెడ్యూల్డ్ తెగలకు చెందిన వారై ఉండాలని, పంచాయితీ ఎటువంటి బకాయిలు లేకుండా ఉండాలని వారు తెలిపారు. జంతు వధ రుసుం వసూలు పాటలో పాల్గొనే వారు రూ.20 వేల సాల్వెన్సీ, రూ.10 వేల డిపాజిట్ షాపింగ్ కాంప్లెక్స్ పాటలో పాల్గొనే వారు రూ.1 లక్ష సాల్వెన్సీ, రూ 30 వేల డిపాజిట్, మార్కెట్ ఆశీలు పాటలో పాల్గొనే వారు రూ.1 లక్ష సాల్వెన్సీ, రూ.1 లక్ష డిపాజిట్, పశువుల సంతలో పాల్గొనే వారు రూ.3 లక్షల సాల్వెన్సీ, రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని వారు వివరించారు. పూర్తి వివరాలకు పంచాయితీ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

24న పెసా గ్రామసభ

ములకలపల్లి: సీతారాంపురం జీపీలోని సోయం గంగులుగూడెంలో ఈనెల 24న అత్యవసర పెసా గ్రామసభ నిర్వహించనున్నట్లు పెసా కమిటీ ఉపాధ్యక్షురాలు కోండ్రు పద్మ, కార్యదర్శి పద్దం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామసభ సమాచారం వివిధ శాఖల అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశామని తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బాదం భాస్కర్‌రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. పేద కుటుంబం కావడంతో అతని వైద్యఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల సాయమందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి, వైస్ చైర్మన్ చింతా అంకిరెడ్డి, ఐవీ రాజేష్, సంకా సురేష్, బత్తుల రామకొండారెడ్డి, పేరం రామిరెడ్డి, జింకల రాం గోపాల్‌రెడ్డి, ఆవుల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెచ్చాకు వినతి

దమ్మపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పేస్కేల్ వర్తింపజేయాలని కోరుతూ జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం తాటిసుబ్బన్నగూడెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో తమ సమస్యలను విన్నవించారు. పదిహేడేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందజేసిన వారిలో జేఏసీ చైర్మన్ వి.సుధాకర్‌రావు, కోశాధికారి జీడీఆర్ పట్నాయక్, టీఏ యూనియన్ కోశాధికారి పి.రాఘవరావు, నియోజకవర్గ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలు ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

కరకగూడెం: 'ఇందిరక్రాంతి పథం'పథకంలో భాగంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లేకపోవడంతో మండలంలోని వీఓఏలు మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యలయ సీసీ తాటి ముత్యాలరావుకు సమ్మె నోటీసులు అందించారు. వచ్చే నెల 2 వతారీఖు వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఓఏలు నర్సింగ్ వెంకన్న, నర్సింహారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా మున్సిపాలిటీ

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వ విప్ పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అధికారులకు సూచించారు. మంగళవారం తన నివాసంలో మున్సిపల్ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మున్సిపాలిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులు, వాటి ప్రతిపాదనల తయారి గురించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మణుగూరు పూలమార్కెట్ సెంటర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ సర్కిల్‌గా నామకరణం చేయడంతోపాటు అక్కడ జయశంక్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పాత మణుగూరులోని గాంధీబొమ్మ సెంటర్‌ను సర్కిల్ ఏర్పాటు చేసి గాంధీ కాంస్యవిగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. మణుగూరు మినీ ట్యాంక్ బండ్ నాయుడు కుంట చుట్టు సీసీరోడ్డు ఏర్పాటుతోపాటు ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. మేఘా పల్లె ప్రకృతి వనంలో అందమైన లైటింగ్, సర్కిల్స్‌లో ఒపెన్ జిమ్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు. మణుగూరు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తయారు చేసి మరింత ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి కృషి చేస్తామన్నారు.



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న విప్ రేగా కాంతారావు

అందుకోసం అధికారులు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఏఈ సత్యనారాయణలు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి

కరకగూడెం: సెర్ప్ ఉద్యోగుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగ్రామమైన కుర్నవల్లిలో సెర్ప్ ఉద్యోగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ ఉత్తర్వులు జారీ చేసి మరోసారి తనేంటో రుజువు చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక, ఏపీఎం త్రిగుణ, సీసీ మురళి, సెర్ప్ జేఏసీ నాయకులు ప్రసాద్, నాగార్జున, రాధా, శోభ, లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో మంగళవారం ఆయన చేతుల మీదుగా రూ.95 లక్షల 11వేల 020 విలువగల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు ఒక వరమని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో గతంలో లేని విధంగా సెంట్రల్ లైటింగ్, ఆర్టీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేయగా.. త్వరలోనే స్థానికంగా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సీసీ రహదారులను సైతం అధికంగా మంజూరు చేసి నిర్మిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. స్థానికంగా ఇరవై నాలుగు గంటల వైద్యం అందిస్తున్నామని, కొద్ది రోజుల్లోనే డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామని అన్నారు. తహసీల్దార్ లూథరన్ విల్సన్, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, సర్పంచ్‌లు నారం రాజశేఖర్, సాధు జోత్స్నబాయి, సోని శివశంకర్ ప్రసాదు, ఎంపీటీసీలు వేముల భారతి, తిరుమల, అనసూయ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, యూఎస్ ప్రకాశ్, తాడేపల్లి రవి, మోహన్ పాల్గొన్నారు.

పినపాక: మండలంలోని పలువురికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపడుచులకు అండగా, పెళ్లిళ్ల చేసి అప్పులు పాలైన మహిళలకు చేదోడుగా కల్యాణ లక్ష్మి పథకం ప్రవేశపెట్టిన ఘనత ప్రభుత్వానికే చెల్లుతుంది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ లేవని అన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు లేని పేదళకు ఇల్లు కట్టిస్తామన్నారు. ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెట్టి మహిళ అని చూడకుండా కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'రామకోటి' సేవలు అభినందనీయం



రామకోటి రామరాజును సత్కరిస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి సిద్దిపేట జిల్లా వాసి రామకోటి రామరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ కొనియాడారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం నిర్వాహకుడు రామరాజు ఆధ్వర్యాన గోటితో వొలిచిన తలంబ్రాలను మంగళవారం అధికారులకు అందజేయగా, ఆయనను సత్కరించి ఏఈఓ మాట్లాడారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, సిబ్బంది, గజ్వేల్‌కు చెందిన అర్చకులు నక్క ప్రదీప్‌శాస్త్రి పాల్గొన్నారు.

పంటనష్టం పరిశీలన

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు, తిప్పనపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించిన మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్ తడిచిన మిర్చిపంటను పరిశీలించారు. ఇటీవల అకాలవర్షాలకు మిర్చిపంటకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తడిచిన మిర్చిపంటను ఆయన పరిశీలించారు.

ఎస్వోటు జీఎంకు వినతి


మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని సింగరేణి ప్రాంతీయ వైద్యశాలలో పొరుగు సేవల వార్డ్ బాయ్‌లను కొనసాగించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా పని చేయడమే కాకుండా కరోనా సమయంలో విశేష సేవలందించిన పొరుగు సేవల వార్డ్‌బాయ్‌లను తిరిగి కొనసాగించాలని, ఇందుకు సంబంధించి టెండర్ వచ్చేలా కృషి చేయాలని ఆయన యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఎస్‌సీసీడబ్ల్యూయూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్, వార్డ్ బాయ్‌లు విద్యాసాగర్, శంకర్, వేణు, సురేందర్, నర్సింహారావు , రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంట నష్టానికి పరిహారమందేనా?

- వర్షాల ధాటికి దెబ్బతిన్న వాణిజ్య పంటలు
- అధ్వానంగా కూరగాయల పంటలు, పండ్లతోటల పరిస్థితి
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



అశ్వాపురం: సీతరాంపురంలో దెబ్బతిన్న టమాట తోట



ములకలపల్లి: నేల వాలిన నాటు పొగాకు మొక్కలు

అశ్వాపురం: మండలంలో నాలుగు రోజులు కురిసిన వర్షాలకు మొక్కజొన్న, టమాట, కూరగాయలు, మిర్చి తోటలు తీవ్ర స్థాయిలో దెబ్బతిన్నాయి. మండలంలో రామచంద్రాపురం, నెల్లిపాకబంజర, సీతరాంపురం, గొల్లగూడెం, ఆనందాపురం, అశ్వాపురం, జగ్గారం, కొమ్ముగూడెం, అమ్మగారిపల్లి, చింతిర్యాల గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, టమాట, కూరగాయలు, మిర్చి సాగు చేశారు. అకాల వర్షాలకు, ఈదురు గాలులకు టమాట, మొక్కజొన్న, కూరగాయల తోటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గాలుకు మొక్కజొన్న పైరు పడిపోయి, వర్షాలకు టమాట పూర్తిగా దెబ్బతింది. కోత దశలో వర్షాలు కురవడంతో టమట కాయలు కుళ్లిపోతున్నాయి. పలు గ్రామాల్లో ఆరబోసిన మిర్చి.. వర్షాలకు స్వల్పంగా తడిసిపోయింది. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే అకాల వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

చేతికొచ్చిన పంట చేజారిపోయింది..

ములకలపల్లి: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట అకాల వర్షాలతో కళ్లముందే చేజారిపోయిందని ములకలపల్లి మండలంలోని బాధిత రైతులు వాపోతున్నారు. మండలకేంద్రం సమీపంలో షేక్ మైనుద్దీన్, షేక్ గౌసుద్దీన్, తిరుమలేశు, ఇనుగండ్ల సత్యం , బైరు ప్రసాద్ మరికొందరు రైతులు సుమారు 50 ఎకరాల్లో నాటుపొగాకు సాగు చేశారు. మరికొద్ది రోజుల్లో పొగాకు కోసి, పందిర్లు వేయాల్సి ఉంది. ఈతరుణంలో రెండు రోజులపాటు ఈదురుగాలులతో కూడిన విస్తారంగా కురిసిన వానలకు పంట మొత్తం నేలపై వాలిపోయింది. వడగళ్లకు ఆకులు చిల్లులు పడ్డాయి. భారీ వర్షాల నేపథ్యంలో కోతదశలోని మొక్కలు నిట్టనిలువునా చనిపోయాయి. ఎకరాకు సుమారు 60 వేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టామని, చేతికొచ్చిన పంట చేజారిపోయిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. పంటచేలోనే భోరున విలపించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.